ప్రజాశక్తి
బుధవారం 18 జూన్ 2025 5 విజయనగరం



లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్


వచ్చేనెల 5న జరిగే జాతీయ లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో చిట్‌ఫండ్, బ్యాంకు మేనేజర్లు, ఆయా కంపెనీల న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి మాట్లాడుతూ చిట్ కంపెనీలు, బ్యాంకులకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న ఇపిలు, బ్యాంకు దావాలను ఎక్కువ కేసులను రాజీ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్, మార్గదర్శి చిట్ ఫండ్స్ కపిల్ చిట్ ఫండ్స్, శ్రీరామ్ చిట్ ఫండ్స్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా ఏర్పాటు కాని పంతంజలి పార్కు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఫుడ్ పార్కు పేరిట సుమారు 172.84 ఎకరాలు వశపర్చుకున్న పతంజలి సంస్థ ఎనిమిదేళ్ల గడిచినా పార్కును ఏర్పాటు చేయలేదు. మరోవైపు అప్పటి వరకు ఈ భూమిలోని వివిధ పంటలు, ఫలసాయాలతో బతుకీడ్చుకునే సుమారు వంద దళితులు, గిరిజనులు, బిసి కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. ఈనేపథ్యంలో చట్ట ప్రకారం భూములు వెనక్కి తీసుకుని, ఆయా కుటుంబాల వారికి అప్పగించడంతోపాటు డి-పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు లేఖరాశారు. ఈనేపథ్యంలో పంతంజలి పార్కు వ్యవహారం మరోసారి రచ్చకెక్కింది. ఎపిఐఐసికి చెందిన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చినరావుపల్లి వెరెన్యూ పరిధిలోని 172.84 ఎకరాల భూమిని ఫుడ్ పార్కు పేరుతో 2017 ఫిబ్రవరి 28న అప్పటి టిడిపి ప్రభుత్వం పతంజలి సంస్థకు కట్టబెట్టిన సంగతి విధితమే. నాటికి చాలా కాలం ముందునుంచే ఈ భూమిలో జీడి, మామిడి వంటి చెట్లు, మొట్టపంటలు సాగుచేస్తూ సుమారు వందమందికిపైగా దళితులు, గిరిజనులు, బిసిలు జీవనసం సాగిస్తుండేవారు. ఈనేపథ్యంలో పంతంజలికి భూమిని కట్టబెట్టడానికి వ్యతిరేకంగా అప్పట్లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. కేవలం బాధితులే కాకుండా వామపక్షాలు, పలు ప్రజాసంఘాల నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. అయినప్పటికీ నాటికి ఎకరా రూ.20లక్షలు పలికే భూమిని, రూ.3లక్షలకు కట్టబెట్టారు. ఇదేమంటే ఈ మెగా ఫుడ్ పార్కు ద్వారా 6వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం.... 2021నాటికి ఈ పార్కును అందుబాటులోకి తెస్తామని కూడా ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. తీరా భూమి కేటాయింపు చేసుకున్న తరువాత పార్కు నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. దీంతో, ఉన్న ఉపాధి పోయింది, కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాకుండా పోయాయి. ఈనేపథ్యంలో పేదలైన దళిత, గిరిజన, బలహీనవర్గాల వద్ద తీసుకున్న భూములు వెనక్కి అప్పగించడంతోపాటు నిబంధనల ప్రకారం పార్కును ఏర్పాటు చేయలేకపోయినందుకు పతంజలి సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని ఇఎఎస్ శర్మ డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు భూములు కోల్పోయిన పేదలు కూడా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

జీవనోపాధి కోల్పోయిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు



పతంజలి పార్కుకు కేటాయించిన భూములు

పతంజలి సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఫుడ్ పార్కు పేరుతో భూములు తీసుకుని, ఏర్పాటుకు ముందుకు రాని పతంజలి సంస్థపైనా, అందుకోసం కారు చౌకగా భూమి కట్టబెట్టిన ప్రజాప్రతినిధులు, అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి (ఐఎఎస్) ఇఎఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రజల తరపున ప్రభుత్వానికి రాసిన లేఖను ఇటీవల విడుదల చేశారు. కాలపరిమితి దాటినప్పటికీ పార్కు ఏర్పాటు చేయలేదని, దీనివల్ల ఆయా భూముల్లో అప్పటి వరకు జీవనోపాధి పొందే కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. ఈ పార్కుద్వారా కొత్తగా సృష్టిస్తామన్న ఉద్యోగాలూ రాలేదు సరికదా, అప్పటి వరకు ఆ భూమిపై జీవనోపాధి పొందే పేదలు కూడా ఆర్థికంగా కుదేలయ్యారని తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీలకు కేటాయించడం చట్టవిరుద్ధమని సుప్రీం కోర్టే 2011 జనవరి 28న జగ పాల్ సింగ్ కేసులో రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసిందని గుర్తుచేశారు. భూమిని ఉపయోగించ నందును తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, అంతకు ముందు సాగుచేసుకునే పేదలకు అప్పగించాలని కూడా డిమాండ్ చేశారు. భూమి ధర ఎకరా రూ.2లక్షల వరకు ఉన్నప్పటికీ కేవలం రూ.3లక్షల చొప్పున కేటాయించడం ప్రజా విశ్వాసానికి విరుద్ధంగా వ్యవహరించడమే అవుతుందని. ఈనేపథ్యంలో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకులు, అధికారులు ప్రజలకు జవాబు దారీగా ఉండడం అవసరం అని కూడా పేర్కొన్నారు.

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

- ఆర్‌టిసి, స్కూలు బస్సు ఢీకొని పలువురికి గాయాలు
- స్వల్ప గాయాలతో బయటపడిన విద్యార్థులు
- ఎమ్మెల్యే లోకం మాధవి పరామర్శ

ప్రజాశక్తి-డెంకాడ

మండల కేంద్రం డెంకాడలో మంగళవారం సాయంత్రం ఆర్‌టిసి బస్సు, స్కూలు బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పాఠశాల విడిచిపెట్టిన తరువాత పిల్లలను తమ ఇళ్లకు తీసుకెళ్తున్న బస్సు..ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొన్నాయి. అయితే ఎవరికీ ప్రాణహాని లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం నుంచి శ్రీకాకుళం వెళుతున్న ఆర్టీసీ బస్సు, డెంకాడకు చెందిన శ్రీ సత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు విజయనగరం వైపు వస్తుండగా ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. స్కూలు విడిచిపెట్టిన తర్వాత పిల్లలందరినీ స్కూల్ బస్సులో నారాయణపురం జమ్ము, దాసన్నపేట, విజయనగరం తీసుకువెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌తో పాటు ఆ వెనుక సీటులో కూర్చున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే స్కూలు బస్సులో ఉన్న పిల్లలు నేహా (7వ తరగతి), తార (5వ తరగతి)కు, స్కూలు టీచర్‌కు బేగంకు స్వల్ప గాయాలయ్యాయి. వీరి ముగ్గురుతో పాటు గాయపడిన ఆర్‌టిసి డ్రైవర్, ముగ్గురు ప్రయాణినులను 108వాహనంలో జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రమాదం జరిగిన తీరును చూసిన వారు మాత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఉంటుందని భావించారు. ఆర్‌టిసి బస్సులో డ్రైవర్ కూర్చున్న వైపు నుజ్జయ్యింది. స్కూల్ బస్సులో సుమారు 35 మంది వరకు పిల్లలు ఉన్నారు. ఆర్టీసీ బస్సులో 40 నుంచి 50 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు పెద్ద ప్రమాదం ఏమీ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో విజయనగరం వైపు వెళ్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి ఈ ప్రమాదాన్ని చూసి కారు దిగి విద్యార్థుల వద్దకు వెళ్లి పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ఎస్ఐ ఎ. సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక ఎస్ఐ సన్యాసినాయుడు రాష్ట్ర హోం మంత్రి ఎస్కార్టుకు వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ఘటన జరిగినట్లు తెలియడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు వచ్చి అక్కడ ఉన్న 108 వాహనంలో ప్రమాదంలో గాయపడిన వారందరినీ జిల్లా ఆసుపత్రికి తరలించారు. రెండు కిలోమీటర్ల మేర రెండు వైపులా ట్రాఫిక్ జామ్ అయిపోవడంతో వెంటనే తన సిబ్బందితో క్లియర్ చేశారు. ప్రమాదం జరిగిన రోడ్డులో అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తరలించారు. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఎస్ఐ సన్యాసి నాయుడును అభినందించారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి





ఒకదాన్ని ఒకటి ఢీకొనడంతో దెబ్బతిన్న ఆర్‌టిసి, స్కూలు బస్సులు

యోగా నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- 30 వేలమందిని విశాఖ తరలింపు
- ప్రజా ప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలి
- జిల్లా ఇంఛార్జి మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి-కంటోన్మెంట్

యోగా జీవన విధానంలో భాగం కావాలనే ఉద్దేశంతో ప్రధాని మోడీ యోగా కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, 5 లక్షల మందితో ఈనెల 21న విశాఖపట్నం లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంఛార్జి మంత్రి అనిత రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ , రహదారులు భవనాల శాఖామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డితో కలసి విశాఖలో నిర్వహించే యోగా కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఇంచార్జ్‌మంత్రి మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని తెలిపారు. యోగా కార్యక్రమానికి వచ్చే వారికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను వేసి రహదారి మార్గం లో అత్యవసరాల కోసం వాష్ రూమ్స్ గుర్తించినట్లు తెలిపారు. ఉదయాన్నే బస్సు లు బయలు దేరతాయి కావునా ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు మూడు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని తెలిపారు. నియోజకవర్గం వారీగా , సచివాలయం వారీగా నమోదు చేసుకున్న జాబితాలను సంబంధిత ఎమ్మెల్యేలకు ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లా నుండి 36 వేల మందిని సిద్ధం చేసుకున్నామని, కనీసం 30 వేల మందిని పంపడానికి 2 రూట్లలో 660 బుస్సులను సిద్ధం చేసామని, ప్రతి బస్సుకు ఒక లైజెన్ అధికారిని నియమించామని తెలిపారు. ప్రధానంగా 15వేల మంది హాస్టల్ విద్యార్థులను పంపడానికి కళాశాలలతో ప్రణాళిక వేశామని,మిగిలిన వారిని డిఆర్‌డిఎ, మెప్మా ద్వారా సమీకరిస్తున్నామని తెలిపారు. ఈనెల 19 న ట్రయల్ రన్ వేస్తామన్నారు. సమావేశంలో ఎంఎల్‌సి రఘువర్మ, ఎమ్మెల్యేలు పూసపాటి అదితి విజయలక్ష్మి , లోకం నాగ మాధవి, మార్కెట్ చైర్మన్ బంగార్రాజు, నక్కా ఆనందబాబు, డిసిసిబి , డిసిఎంఎస్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, గొంప కృష్ణ ,టిడిపి, జనసేన, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు అనిత, సత్యప్రసాద్, కలెక్టర్ అంబేద్కర్

5555 వేదికలు గుర్తింపు : కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా 5555 వేదికల్లో సుమారు 8లక్షల 82వేల మందితో యోగా ప్రదర్శన జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. యోగా దినోత్సవ నిర్వహణ, తరలింపుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లానుంచి సుమారు 8.82 లక్షలమంది రిజిష్టర్ చేసుకున్నారని, వారందరితో 21న యోగా ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా నుంచి 30వేల మందిని విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి పంపిస్తామని, దీనికోసం 660 బస్సులను వినియోగిస్తున్నామని చెప్పారు. వీరిని తరలించే బాధ్యత ఎంపిడిఒలదేనని స్పష్టం చేశారు. ఈ 30 వేల మందిలో 15వేల మంది విద్యార్థులు కాగా, మిగిలిన వారు సాధారణ పౌరులని చెప్పారు. 8వ తరగతి ఆపై తరగతుల విద్యార్థులను మాత్రమే ఈ కార్యక్రమానికి పంపించాలని చెప్పారు. ముందుగానే బస్సులను పంపుతామని, ప్రతీ బస్సుకు ఒక లైజనింగ్ అధికారిని ఏర్పాటు చేశామని చెప్పారు. విశాఖకు దగ్గర ప్రాంతాల నుంచి ఉదయం 4 గంటలకు, దూర ప్రాంతాల నుంచి 3 గంటలకే బస్సులు బయలు దేరాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేకాధికారు లంతా 20వ తేదీ రాత్రి మండలాల్లోనే ఉండి ఈ తరలింపు ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిఇఒ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

త్వరలో అన్నదాత సుఖీభవ : నాగార్జున

ప్రజాశక్తి- కంటోన్మెంట్

పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేసిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ కింద కూడా వారి అకౌంట్లలో నిధులు జమ చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ఇంటిలో ఎంత మంది విద్యార్థుల ఉన్నప్పటికీ ఒక్కరికే అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసిందని.. తాము చెప్పిన ప్రకారం తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో చదువుకుంటున్న పిల్లలందరికీ అందించామని చెప్పారు. మత్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20వేలు సహాయం అందించామన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలో విడుదల చేయనున్నామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. ఓర్వలేకే వైసిపి దుష్ప్రచారం చేస్తోందన్నారు. వైసిపి నాయకులు విడుదల చేసిన పుస్తకాలును చెత్త బుట్టలో వెయ్యాలని అన్నారు. సమావేశంలో దంగా భూలోక, చినబాబు,రాములప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

త్వరలో పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ ప్రక్రియను చేపట్టనున్నామని డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన ఛాంబర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాత భవనాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను కొత్త భవనాల్లోకి మార్పు, అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు, కేంద్రాల్లో మార్పులు చేర్పులకు, ఒకచోట నుంచి మరో చోటుకు తరలించడానికి అవకాశం ఉందన్నారు. 1200 కంటే ఓటర్లు ఎక్కువగా ఉన్నచోట అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, తరలింపులు, కొత్త కేంద్రాల ఏర్పాటుకు ఈ నెల 30 లోగా రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను అందజేయాలని కోరారు.



ఎమ్మెల్యే అదితికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

బేసిక్ వేతనాలివ్వాలి

ఎమ్మెల్యే, మేయర్లకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ సప్లై, పర్యావరణ విభాగాల్లో పనిచేస్తున్న ఆప్కాస్, థర్డ్ పార్టీ కార్మికులకు జీవో నెంబర్ 36 (లేదా) 1615 ప్రకారం బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతికి, నగరపాలక సంస్థ మేయర్ వెంపటాపు విజయలక్ష్మికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ విజయనగరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వాటర్ పంపింగ్, సరఫరా, లీకులు, వాల్ ఆపరేటర్లు, విలీన ప్రాంత కార్మికులను ఆప్కాస్ లో చేర్చలేదని, అప్కాస్ లో ఉన్న ఇంజినీరింగ్ కార్మికుల కు కూడా పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనాలు పెరగని కారణంగా ఒక్కొక్క కార్మికుడు 3 నుంచి 4 లక్షల రూపాయలు నష్టపోయారని, ఇప్పటికైనా అందరికీ సమానంగా వేతనాలు చెల్లించాలని కోరామన్నారు. థర్డ్ పార్టీ కార్మికులకు 2 నుంచి 3 నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయని, ఎప్పుడు ఇస్తారో తెలియదని ఆందోళన వ్యక్తం చేశారు. అప్కాస్ కార్మికులతో సమానంగా వేతనాలు ప్రతి నెలా 10వ తేదీ లోపు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ కట్టని కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలన్నారు. లేబర్ హాలీడేస్, సిక్, క్యాజువల్ లీవులు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎస్.రామునాయుడు, ఎస్.రాజు, వై.భాస్కర్రావు, అర్జున్, నారాయణ రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కమ్మ వీధి జంక్షన్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది మంగళవారం తొలగించి వేసారు. అనుమతి లేకుండా పై అంతస్తు నిర్మాణాన్ని చేపట్టేందుకు సిద్ధం చేసిన సెంట్రింగ్ పనులను నిలుపుదల చేశారు. అదేవిధంగా కొత్త అగ్రహారం వద్ద కాలువను ఆక్రమించి స్లాబ్ ను వేయడాన్ని గుర్తించిన ప్రణాళిక సిబ్బంది దానిని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో అనధికార, అనుమతులు లేని కట్టడాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం నుండి నిర్మాణాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు.

తనను తాను చెక్కుకున్న శిల్పి..చిట్టిబాబు

రిటైర్డ్ ఐజి ఎల్‌కెవి రంగారావు

జాతీయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత రాజ్యాంగ విధాన పరిషత్ సభ్యుడు, భారత రత్న సి సుబ్రహ్మణ్య పేరిట నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా నుంచి జాతీయ అవార్డు అందుకున్న సామాజిక వేత్త పి.చిట్టిబాబు తనను తాను చెక్కుకున్న శిల్పి అని రిటైర్డ్ ఐజి ఎల్‌కెవి రంగారావు ప్రశంసించారు. మంగళవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో పౌర సన్మాన వేదిక, డిబిఎస్‌యు ఆధ్వర్యంలో డిబిఎస్‌యు వ్యవస్థాపకుడు చిట్టిబాబు కు ఆత్మీయ అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. జర్నలిస్ట్ సిహెచ్ జైరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐజి రంగారావు ముఖ్య అతిథులు హాజరై, అతిథులతో కలిసి చిట్టిబాబు, ఆయన సతీమణి సుదీపాను ఘనంగా సత్కరించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూసామాజిక ఉద్యమాలలో అనేక అవరోధాలు ఎదుర్కొంటూ రాజ్యాంగ విలువలకు లోబడి బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణకు చిట్టిబాబు చిత్తశుద్ధితో పనిచేయడం అభినందనీయమని అన్నారు. సమాజంలో వివక్షతకు గురవుతున్న ప్రజల పక్షాన వివక్షత లేని సమాజం వైపు పయనించే నాయకులలో చిట్టిబాబు ప్రముఖుడని అందుకే అవార్డు ఆయనను వెతుక్కుంటూ వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగులో ప్రచురించిన భారత రాజ్యాంగ పుస్తకాన్ని రంగారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అవార్డు గ్రహీత చిట్టిబాబు మాట్లాడుతూ సామాజిక ఉద్యమంలో దళిత ఆదివాసి మానవ హక్కుల ఉద్యమంలో పనిచేస్తున్న, సహకార మందిస్తున్న ప్రతిఒక్కరికీ ఈ అవార్డు అంకితమని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య విశిష్ట, గౌరవ అతిథులుగా హాజరైన ప్రముఖ లంతా తొలుత భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వివిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎం.వెంకటేశ్వర రావు, ఎటికె ప్రతినిధి ఎమ్‌డి అహమ్మద్, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ, ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ తెన్నేటి జైరాజ్, జెవివి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు, పలువురు దళిత సంఘాల నాయకులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు ప్రసంగిస్తూ చిట్టిబాబు చేస్తున్న కృషిని కొనియాడారు.



చిట్టిబాబు దంపతులను సన్మానిస్తున్న రిటైర్డు ఐజి రంగారావు, డాక్టర్ వివిఎస్ ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు

మండల కేంద్రాల్లో ఫిర్యాదుల స్వీకరణ

అర్జీల సమాచారం కోసం 1100

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100కు ఫోన్ చేయవచ్చు

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకుండా, పరిష్కారం ఏ దశలో ఉంది సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్ లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

గ్రామీణాభివృద్ధికి ఆటంకాలు తొలగించండి

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి జరగాలంటే ఉపాధిహామీలో పనిచేసిన ప్రతి పనికి వెంటనే నిధులు విడుదల చేసేలా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాసిన లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, బిటి రోడ్లు, సోప్ పిట్లు, మినీ గోకులాలు నిర్మించారని, పవన్ కళ్యాణ్ ప్రకటనతో వెంటనే బిల్లులు చెల్లిస్తారనే ఆశతో గ్రామీణ ప్రాంతాల యువత వడ్డీలకు డబ్బు తెచ్చి అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసారని తెలిపారు. నేడు బిల్లులు రాక, వడ్డీలు కట్టుకోలేక వెండర్స్ తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు ఎవ్వరూ చెయక అభివృద్ధి కుంటుపడే పరిస్థితి ఉందని తెలిపారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం



నగరంలోని దాసన్నపేట స్థానిక ప్రైవేట్ హాల్లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులకు ప్లాస్టిక్ సర్జరీ, వ్యాస్కులర్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జన్ కాస్మోటిక్ డాక్టర్ శ్రావణి ముద్దాడ మాట్లాడుతూ కాలిన గాయాలకు గ్రామీణ ప్రాంతంలో పసుపు వంటి ద్రవాలను వేస్తారని, అలా చేయటం వల్ల ఆ చుట్టూ ఉండే చర్మం సహజ గుణాన్ని కోల్పోతుందని అన్నారు. వెంటనే కాలిన గాయాలకు చల్లని నీటిని మంట తగ్గినంతవరకు వేయాలని, దగ్గరలో ఉండే ఆసుపత్రికి రిఫర్ చేయాలని తెలిపారు. ప్రసవ అనంతరం పొట్టపై వచ్చే జారలు, వృక్షోజాల మార్పులు, చెవి పోగులు కిందికి జారడం వంటివి కాస్మోటిక్ చికిత్స ద్వారా సహజ స్థితికి తీసుకురావచ్చునని తెలిపారు. కాలిపై వచ్చే చిన్న చిన్న నల్లటి పండును అశ్రద్ధ చేయటం వలన అవి రక్తం అందక చివరికి ఆ భాగాన్ని తొలగించే పరిస్థితి వస్తుందని. ఏదైనా ఒక మానని పుండు రెండు నెలలు పైగా ఉంటే ఆ భాగానికి రక్తం అందలేదని మనం అర్థం చేసుకోవాలన్నారు. వాటినివ్యాస్కులర్ చిక్కిత్స ద్వారా నయం చేయవచ్చునని తెలిపారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా జోనల్ అధ్యక్ష కార్యదర్శులు జంగం జోషి, గెద్ద చిరంజీవి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కోట్ల పైడిరాజు, కార్యదర్శిగా కర్రి సత్యనారాయణ, కోశాధికారిగా గుప్త, సహాయ కార్యదర్శిగా భవాని సిటీ ఇంచార్జ్ టి.సీతారాం తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో త్రినాధరావు, ఎం. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

విజయనగరం టౌన్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. మంగళవారం ప్రతి సచివాలయ పరిధిలో డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధుల పట్ల జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఇందుకోసం ప్రజలు ముందస్తు జాగ్రత్తలను చేపట్టాలన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రహదారికి మరమ్మతు పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి ఓబలయ్యపాలెం, కళ్లెంపూడి గ్రామానికి వెళ్లే రహదారి మరమ్మతులకు గురైంది. దీన్ని వెంటనే బాగుచేయాలని సిపిఎం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇటీవల నిరసన తెలిపారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో స్పందించిన ఇఒపిఆర్‌డి రవికుమారి, సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి గ్రామపద్ద సన్యాసిరావు పంచాయతీ కార్యదర్శి కాకర భారతి పర్యవేక్షణలో రోడ్డుకు ఏర్పడిన గుంతలను మంగళవారం మట్టితో పూడ్చివేయించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - చీపురుపల్లి

నిత్య యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇంఛార్జి ఎంపిడిఒ సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యం కోసం ప్రతి వ్యక్తి ప్రతి రోజూ యోగా చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, మండల పరిషత్ ఎఒ తామరాపల్లి ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి–చీపురుపల్లి

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఓపెన్ స్కూల్‌లో జాయిన్ అయ్యే వారి కోసం అడ్మిషన్లు ప్రారంభించామని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుని ఉమామహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఓపెన్ స్కూల్‌కి సంబంధించి పదవ తరగతి, ఇంటర్‌మీడియట్‌లో చేరేందుకు ఈ నెల 27 వరకు అవకాశం ఉందని తెలిపారు. వివరాల కోసం పాఠశాల పీడీ కాపరోతు మురలీధర్‌ని సంప్రదించాలని ఆమె కోరారు.

కెజిబివిలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి– తెర్లాం

మండలంలోని కుమార్‌పేట గ్రామంలో ఉన్న కెజిబివి వసతి గృహంలో ఎంపిడిఒ రాంబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఇఒ త్రినాథరావు, డిప్యూటీ ఎంపిడిఒ నీలిమతో కలిసి వసతి గృహాన్ని పరిశీలించారు. స్కూళ్ళు ప్రారంభమైన తరువాత వసతి గృహాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, పిల్లలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారా లేదా అని ఆరా తీశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కెజిబివి సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించారు. గదులు పరిశుభ్రత, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్ పరిశీలించి పిల్లలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. 21వ తారీఖున విశాఖపట్నంలో జరగబోయే యోగాంధ్రలో విద్యార్థులు పాల్గొనేటట్లు సహకరించాలని సూచించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి– శృంగవరపుకోట

నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలి రావాలని ప్రజా వాగ్గేయకారుడు ఆతవ ఉదయ భాస్కర్ పిలుపునిచ్చారు. జామి, పావాడ గ్రామంలో మంగళవారం గోడ పత్రికను పావాడ అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు ఆద్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ భాస్కర్ మాట్లాడుతూ పోరాట చరిత్ర గలిగిన పావాడలో ఈనెల 22న ఉదయం 9గంటలకు అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని దీనికి ప్రజా ప్రతినిధులు పూలే అంబేద్కర్ వాదులు పౌరహక్కుల నేతలు మహిళా సంఘ సభ్యులు హాజరుకావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు బోనెల ఈశ్వరరావు, మెయ్యి వెంకటరమణ, పావాడ దళిత మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటే మోసం

ప్రజాశక్తి - వేపాడ

చంద్రబాబు అంటే మోసం.. జగన్ అంటే నమ్మకమని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వైసిపి ప్రచురించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనంతా మోసమేనని అన్నారు. జగన్ అంటే నమ్మకం అనడానికి జగన్ పాలనలో అద్భుతంగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఎమ్మెల్యే బేబినాయన ఆదేశించారు. స్థానిక కోటలో మంగళవారం ఎమ్మెల్యేను ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కవిత, జెఇలు కలిశారు. పెండింగులో ఉన్న పనులను పూర్తి చేసి ఇంటింటికి కుళాయిలు వేసి తాగునీరు అందించాలని ఆదేశించారు. 6 నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని పిరిడి సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఆవాల అనంతరావు తెలిపారు. స్టబ్ స్టేషన్లో ఆర్‌డిఎస్‌ఎస్ స్కీమ్‌లో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు పిరిడి, అలజంగి, పక్కి ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా అయ్యే గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, సహకరించాలని ప్రజలను కోరారు.

సిడిపిఒగా రాజేశ్వరి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గజపతినగరం ఐసిడిఎస్ సిడిపిఒగా రాజేశ్వరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె చీపురుపల్లి సిడిపిఒగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ సిడిపిఒగా పనిచేసిన నాగమణి చీపురుపల్లికి బదిలీపై వెళ్లారు. కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొని ఐసిడిఎస్ బలోపేతం చేసేందుకు, తమ విధులు సక్రమంగా నిర్వహించడానికి కృషి చేస్తానని రాజేశ్వరి తెలిపారు.

యోగాంధ్రకు 2.20 కోట్ల మంది రిజిస్ట్రేషన్

మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి - భోగాపురం

యోగాంధ్ర డే సందర్భంగా రాష్ట్రంలో 2.20 కోట్ల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు తెలిపారు. యోగాంధ్ర నియోజకవర్గ పరిశీలకులుగా ఆయన మంగళవారం పోలిపల్లి సమీపంలో భూమాత లేఔట్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు అవగాహన కల్పించి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీ నాయకులు కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, గేదెల రాజారావు, కడగల ఆనంద్ కుమార్, అప్పలనారాయణ, అకిరి ప్రసాద్, చిల్లా పద్మ, చీకటి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపరితి, వావిలపాడు, దుంగాడ గ్రామ రెవెన్యూ పరిధిలో గల రాతి క్వారీల నుండి విశాఖపట్నం జిల్లాకు పరిమితికి మించిన బరువుతో లారీలు ప్రయాణించడం వల్ల మలుపు వద్ద అదుపుతప్పి మంగళవారం ఒక లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఏ ఒక్కరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అధిక లోడ్లతో ప్రయాణించే క్వారీ లారీలను అదుపు చేసేలా పోలీసులు జాగ్రత్తలు తీసుకోకపోవడం ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెద్ద శిర్లాం మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి– రేగిడి

మండలంలోని పెద్దశిర్లాం మాజీ సర్పంచ్ పాలవలస జగదీష్(49) మంగ ళవారం గుండెపోటుతో మృతి చెందారు. విశాఖపట్నంలో టీ తాగుతుండగా ఒక్కసారిగా గుండెపోటు వచ్చి అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందారు. ఈయన 2014 నుంచి ఐదేళ్లపాటు సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించారు. చిన్న వయసులో రాజకీయాలకు వచ్చి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మృతునికి భార్య సుజాతతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. జగదీష్ మృతి పట్ల తోటి నాయకులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

తల్లికి వందనం.. కోతలతో బంధనం

◆ఆన్‌లైన్ తప్పిదాలతో లబ్ధిదారుల ఆందోళన ◆పథకానికి 1125 మంది విద్యార్థులు దూరం ◆సచివాలయాల చుట్టూ తిరుగుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి– డెంకాడ

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో పిల్లల తల్లిదండ్రులకు కోతలతో బంధనం విధించింది. ఆన్‌లైన్ తప్పిదాల వల్ల అర్హత ఉన్న పిల్లలకు కూడా పథకం వర్తించలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్న 1125 మంది విద్యార్థులు ఈ ఏడాది తల్లికి వందనం పథకానికి దూరమవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పథకం వర్తించని అర్హులకు గ్రీవెన్సు పెట్టుకునే వెసులు బాటు కల్పించడంతో పిల్లల తల్లిదండ్రులు తమ వద్ద ఉన్న అర్హత పత్రాలను పట్టుకుని సచివాలయాల చుట్టూ కళ్లారిగేలా తిరుగుతున్నారు.

మండలంలో 17 సచివాలయాలు ఉండగా వాటి పరిధిలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 7,470 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 6,345 మంది తల్లికి వందనం పథకానికి అర్హులు కాగా 1125 మంది విద్యార్థులు అనర్హులుగా ప్రకటించారు. దీంతో వీరంతా మళ్లీ పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు.

ఊరూరా అనర్హులే..

అక్కివరం సచివాలయంలో 43 మంది విద్యార్థులు అర్హత లేనట్టుగా వచ్చింది. అమకాం సచివాలయ పరిధిలో 30 మంది విద్యార్థులకు తల్లికి వందనం రాలేదు. బంటుపల్లిలో 18 మంది, చొల్లంగి పేటలో 28 మందికి, బొడ్డవలసలో 58, చింతలవలస వన్‌లో 32, చింతలవలస టులో 149, డెంకాడలో 84, గునుపూరుపేటలో 81, గొలగాంలో 38, జొన్నాడలో 46, మోదవలసలో 56, మోపాడలో 93, పెదతాడివాడలో 212, పినతాడివాడలో 44, రఘుమండలో 35, సింగవరంలో 75 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తించలేదు.

ఆన్‌లైన్ తప్పిదాలతో ఇబ్బందులు

ఈ పథకంలో అనర్హులకు ఆన్‌లైన్‌లో వివిధ కారణాలు చూపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకానికి పలు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఆన్‌లైన్ తప్పిదాలతో అర్హులైన లబ్దారులకు కూడా ఈ పథకం వర్తించలేదు. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రుల పేరు మీద భూములు ఉన్నట్లు చూపిస్తోంది. 300 యూనిట్ల కంటే విద్యుత్తు వాడినట్లు, కుటుంబ యజమానికి 12,000 కంటే ఎక్కువ ఆదాయం వస్తున్నట్లు ఇలా పలు రకాలు కారణాలతో లబ్ధిదారులను అనర్హులుగా చూపించారు.

సెంటు భూమి లేని వారికి 55.58 ఎకరాలున్నాయట!

సెంటు భూమి కూడా లేని వారికి భూములు ఉన్నట్టు చూపించడంతో తమ పిల్లలకు తల్లికి వందనం వర్తించలేదు. భోగాపురం మండలం సబ్బన్నపేటకు చెందిన మల్లెడ అప్పారావు, ఆదిలక్ష్మి దంపతులు 15 నెలల క్రితం డెంకాడ మండలం చొల్లంగి పేట పంచాయతీ గువ్వపేటలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరూ రోజు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి గతంలో ఉన్న ఊరిలో గాని ప్రస్తుతం జీవిస్తున్న ఊర్లో గాని సెంటు భూమి కూడా లేదు. అయితే వీరు పేరు మీద గతంలో ఉన్న గ్రామం సబ్బన్నపేటలో సర్వేనెంబర్ 139లో 55.58 ఎకరాల మెట్ట భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపించింది. దీంతో ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం రాలేదు. ఆన్‌లైన్‌లో తప్పిదం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు సచివాలయల చుట్టూ తిరుగుతున్నారు. ఈ పథకం గత సెప్టెంబరులో ఉన్న డేటా ప్రకారం ఎకౌంట్‌లో డబ్బులు వేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని, ప్రస్తుతం ఉన్న డేటా ప్రకారం తల్లికి వందనం పథకం వేస్తే ఇంతమంది విద్యార్థులకు నష్టం వాటిల్లేదు కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హత ఉన్న పిల్లలందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



55.58 ఎకరాలున్నట్లు చూపిస్తున్న పేద కుటుంబం ఇదే..

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

ప్రజాశక్తి– బొబ్బిలి

పాలస్తీనపై ఇజ్రాయిల్ మారణ హోమాన్ని ఆపాలని సిఐటియు దేశవ్యాప్త పిలుపులో భాగంగా బొబ్బిలి కోరాడ వీధి సెంటర్లలో మంగళవారం నిరసన తెలిపారు. పాలస్తీనా మహిళలు, చిన్నపిల్లలపై ఇజ్రాయిల్ ఊచకోత కోయడన్ని ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు కోరారు. మతోన్మాదులు, జాతి దురహంకారులకు ఓట్లు వేసి గెలిపిస్తే ప్రపంచంలో ప్రజలు ఎంత తీవ్రంగా నష్టపోతారో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నేతన్యాహు భారత ప్రధాని నరేంద్ర మోడీని చూస్తే తెలుస్తుందని అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ వెంటనే కాల్పులు విరమణ జరపాలని అంతర్జాతీయ సమితిలో తీర్మానం పెడితే భారత్ ఆ ఓటింగ్‌లో పాల్గొకపోవడం దుర్మార్గమని అన్నారు. మన అలీనా విదేశాంగ విధానాన్ని మోడీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని అన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీనపై యుద్ధం చేస్తూనే ఇరాన్‌పై యుద్ధం ప్రకటించి పశ్చిమాసియా ప్రాంతాన్ని యుద్ధభూమిగా మారుస్తుందని అన్నారు. ఇజ్రాయిల్ చేస్తున్న ఈ దుర్మార్గం వల్ల భారతదేశంలో ప్రజలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని అన్ని రకాల ధరలు తీవ్రంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయులు చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ 90 లక్షల మంది పైగా పశ్చిమాసియాలో ఉన్నారని చెప్పారు. వీళ్ళ పరిస్థితి ఈ యుద్ధం వల్ల దారుణంగా ఉంటుందని అన్నారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు కొమ్ము కాయడం మానేసి పశ్చిమాసియాలో శాంతి కోసం ప్రయత్నం చేయాలని నిరసనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.గౌరేష్, రామారావు, సాంబ కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

'షెడ్‌ను మేమే తొలగించాం'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వాస్తుకు విరుద్ధంగా, శిథిలావస్థలో ఉన్న శ్మశానంలో ఉన్న షెడ్‌ను పంచాయతీ తీర్మానంతో స్వచ్ఛందంగా తామే తొలగించామని కొవ్వాడ గ్రామస్థులు స్పష్టం చేశారు. ఈ చర్యపై దురుద్దేశ విమర్శలు చేస్తున్నవారిపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం కొవ్వాడ అగ్రహారం గ్రామ శ్మశానవాటికను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, గ్రామస్థులు విలేకరులతో మాట్లాడారు. షెడ్ శిథిలావస్థకు చేరడంతోపాటు వాస్తుకు విరుద్ధంగా ఉండటంతో గ్రామంలో కొన్ని అకాల మరణాలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ విషయమై సర్పంచ్ రఘుతోపాటు వార్డు సభ్యులకు తెలియజేసామన్నారు. దాంతో పంచాయతీ బోర్డు సమావేశంలో తీర్మానం చేసారన్నారు. అయితే ఆ తీర్మాణం ఉన్నతాధికార్లుకు పంపుతామన్నారు కానీ ఈ లోపే తమకున్న భయాందోళనతో షెడ్‌ను తొలగించినట్టు వివరించారు. షెడ్ తొలగింపులో సర్పంచ్‌కు ఎటువంటి సంబంధమూ లేకపోయినా కొంతమంది వ్యక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం షెడ్ తొలగిస్తే ఈ రోజు ఫిర్యాదుచేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సర్పంచ్ వ్యక్తిగత నిధులతో గ్రామాభివృద్ధి చేయడం ఓర్వలేకే ఈ రధ్ధాంతం చేస్తున్నారన్నారు. ఆయన ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టేందుకు గ్రామానికి వచ్చిన ఇంఛార్జి ఇఒపిఆర్‌డి బూషణరావు ప్రజలను విచారించకుండానే వెళ్ళిపోయారని ఆరోపించారు. ఫిర్యాదు దారుడు కూడా పత్తాలేడన్నారు. వాస్తవాలను నిష్పక్షపాతంగా పరిశీలించి, అవసరమైతే సంబంధిత నిర్ణయాలను తిరిగి సమీక్షించాలని అధికార్లను గ్రామస్తులు అభ్యర్థించారు. శ్మశానాన్ని సందర్శించిన వారిలో సర్పంచ్ కోట్ల రఘు, వైసిపి నాయకులు దేబార్కి అప్పారావు, బడి నర్సయ్య, ప్రజాప్రతినిధులు పతివాడ తాతినాయుడు, కోట్ల సత్యం, కోట్ల కృష్ణ, అల్లాడ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలివ్వాలి

ప్రజాశక్తి– సంతకవిటి

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్వాడి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పేద కుటుంబానికి చెందిన వారేనని, వారికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చెయ్యకపోవడం సరికాదని అన్నారు. అంగన్వాడీ సిబ్బంది చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ అతి కష్టంతో సాగిస్తున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి తల్లికి వందనం వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మధుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఆశీరప్పడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాంబాయి, దమయంతి, ధవళేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె.వరప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన ప్రకారం 12వేలు లోపు ఉన్న వారంతే అర్హులైనపుడు రూ.11500 జీతం తీసుకునే తాము అనర్హులమెలా అయ్యామని ప్రశ్నించారు. తల్లికి వందనంతో పాటు రేషన్ కార్డులు కూడా తమకు ఇవ్వడం లేదన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలైనా అమలు చేయాలని, లేకపోతే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ సదుపాయాలన్నీ తమకు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పి.జ్యోతి. ఆర్. రేణుక, జి. ముత్యాలమ్మ, ఎస్ రాములమ్మ, పి నరసమ్మ, వై పద్మావతి, ఆర్ దమయంతి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్, బొండపల్లి: అంగన్వాడీలకు సంక్షేమ పథకాల అమలు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. సాధికార సర్వేలో 'ప్రభుత్వ ఉద్యోగి' అనే పదాన్ని తొలగించాలని మంగళవారం గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ తహశీల్దార్ కార్యాలయాల వద్ద అంగన్వాడీలు ధర్నాలు చేశారు. ఈ సందర్భంగా బొండపల్లి, గజపతినగరంలో వి.లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారికి ఇస్తున్నది కేవలం గౌరవ వేతనం మాత్రమే అని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం సుభాషిని, సిహెచ్ కుమారి, డి.నాగమణి, సౌజన్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భోగాపురం: సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. భోగాపురం ఐసిడిఎస్ పరిధిలోని భోగాపురం పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రేషన్ కార్డులు, దీపం పథకం, తల్లికి వందనం అంగన్వాడీలకు వర్తింప చేయకపోవడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొర్లమ్మ, అనిత, ఉమా రాజేశ్వరి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి : ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విమానాశ్రయ పనులను పరిశీలించిన ఎంపి

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయ నిర్మాణ పనులను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఆయనకు విమానాశ్రయం లోపల జరుగుతున్న పనులను వివరించారు. రన్ వే, ఎయిర్ ట్రాఫిక్ సిగ్నల్ టవర్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఎప్పటిలోగా పూర్తవు తుందనే దానిపై ఎంపీకి వివరించారు. ఎంత మేర పనులు జరిగాయో అన్న వివరాలను జిఎం ఆర్ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

నేడు బొబ్బిలికి మంత్రి

బొబ్బిలి: రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నేడు బుధవారం బొబ్బిలి రానున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. బొబ్బిలి ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమానికి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు, డిసిఎంఎస్, డిసిసిబి చైర్మన్లు వస్తారని, జయప్రదం చేయాలని రైతులను కోరారు.

ప్రజలను మోసగించిన ఘనత వైసిపిదే

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనత వైసిపిదేనని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో రాజధాని విషయంలో మాట మార్చి ప్రజలను మోసం చేయడం వల్లనే 2024 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అమ్మ ఒడిలో రూ.2వేలు వైసిపి పాలకుల సొంత జేబులో వేసుకోవడంతో కూటమి ప్రభుత్వం కూడా తల్లికి వందనం రూ.2వేలు సొంత జేబులో వేసుకుంటుందని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

తల్లికి వందనం రూ.2వేలు జిల్లా కలెక్టర్ల ఖాతాలో జమ చేసి పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ఖర్చు చేస్తుం దని చెప్పారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రావనకాష్టంగా మారిందని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చడంతోనే వారికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంతో ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆయనతో టిడిపి నాయకులు ఎం.తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

కౌలు పత్రాలు అందజేత

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని కొత్తబగ్గాం, పాతబగ్గాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి కౌలు రైతులకు కౌలు కార్డులను అందించారు. అనంతరం ఎడిఎ మహారాజన్ ఆధ్వర్యంలో రైతులకు 1318 వరి వంగడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎడిఎ మహారాజన్ మాట్లాడుతూ రైతు సమస్యలు తీర్చడానికి, వారంలో రెండు రోజులు మంగళ, బుధవారాలు 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కౌలు రైతులకు విత్తనాలు రాయితీ, పంట నష్టం, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, మద్దతు ధర, బ్యాంక్ రుణాలు వంటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ పంటలో భాగంగా వరి విత్తనాలు వేసే రైతులు 1121 రకానికి బదులుగా నీటి అవకాశం ఉన్న గ్రామాల్లో 1318 రకం వేస్తే మంచి దిగుబడులు వస్తాయని సూచించారు. అనంతరం కొత్తబగ్గాం రైతు సేవా కేంద్రం వద్ద కౌలు రైతులకు కౌలు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ కిరణ్ కుమార్, హెచ్‌ఒ దీప్తి, విఎఒలు ప్రవీణ్ కుమార్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో మధుపాడ రైతులకు అన్యాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రీసర్వేలో మధుపాడ రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారంతా జిల్లా కలెక్టర్‌ని ఆశ్రయించారు. ఆ గ్రామానికి చెందిన మల్లి పాముల ప్రకాశరావుకు 2 ఎకరాలు సాగుభూమి ఉండగా రీసర్వేలో 33.8 ఎకరాలు భూమి ఉన్నట్లు నమోదయ్యింది. నల్లం శ్రీనివాసరావు అనే రైతుకి 2.60 ఎకరాలు భూమి వుండగా రీసర్వేలో 11.92 ఎకరాలు భూమి ఉన్నట్లు నమోదయ్యింది. కాగా గ్రామం మొత్తం మీద 384 ఎకరాల భూమి ఉంటే రీసర్వేలో మాత్రం 1000 ఎకరాలు రైతుల పేరిట నమోదు కావడంతో రైతులు ఆందోళన చెంది సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం రీసర్వే తప్పులు సరి చేసి మధుపాడ రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌కి మంగళవారం వినతిపత్రం అందించారు.



కలెక్టర్‌ను కలిసిన మధుపాడ రైతులు

రాయితీపై విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి– శృంగవరపుకోట

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలను పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ కాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులందరూ అలసత్వం వహించకుండా రైతులందరికీ సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని కోరారు. రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని కొనుగోలు చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, మండల పార్టీ అధ్యక్షులు జీఎస్ నాయుడు, ఎఎంసి చైర్మన్ మల్లు నాయుడు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రామనాజీ, దోకుల అచ్చెంనాయుడు, భీశెట్టి అరుణ, ఐటిడిపి నాయకులు చక్కా కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, పెదగాడ రాజు, గనివాడ బంగారునాయుడు, వశి వెంకటరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో బట్టల దుకాణం దగ్ధం

ప్రజాశక్తి–చీపురుపల్లి

పట్టణంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బట్టల దుకాణం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బట్టల దుకాణం యజమాని కె జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. చీపురుపల్లి మెయిన్ రోడ్డులో గల వంశీ విష్ణు థియేటర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో న్యూలుక్ అనే పేరు మీద గత కొన్ని ఏళ్ల నుండి బట్టల షాపు నడుపుతున్నాను. మంగళవారం తెల్లవారు జామున నా బట్టల షాపు నుండి పొగలు వస్తున్నాయని అక్కడున్న స్థానికులు తెలిపారు. నేను వచ్చి చూసేసరికి షాపులో ఉన్న బట్టలతో పాటు ఫర్నీచర్, ఎసిలు వంటివి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. నా కుటుంబ పోషణ కోసం అప్పు చేసి రెడీమేడ్ బట్టల షాపు పెట్టుకొని జీవిస్తున్నాను. ఇంతలో అగ్ని ప్రమాదం జరగడంతో తీవ్రంగా నష్టపోయానని వాపోయాడు.

ఇది ఇలా ఉండగా స్థానిక అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ సాంభమూర్తికి సమాచారం అందడంతో హుటాహుటిన తన సిబ్బందింతో కలసి సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. అప్పటికే పూర్తిగా షాపులో మంటలు ఎగిసి పడడంతో షాపులో ఉన్న బట్టలు, ఫర్నీచర్, ఎసిలు వంటివి పూర్తిగా కాలి బూడిదయ్యాయని తెలిపారు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని అగ్నిమాపక ఎస్‌ఐ సాంభమూర్తి అంచనా వేశారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయం నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న చందక సూర్యనారాయణ (57) అనే వ్యక్తి ఫిట్స్ వచ్చి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. పూసపాటిరేగ మండలం గొల్లపేట గ్రామానికి చెందిన సూర్యనారాయణతో పాటు ఆయన కుమారుడు కూడా గత కొన్ని రోజుల నుంచి విమానాశ్రయ నిర్మాణ పనుల్లో కెసిపి కనస్ట్రక్షన్ సబ్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నారు. మంగళవారం సూర్యనారాయణకు ఫిట్స్ వచ్చి పడిపోవడంతో వెంటనే యాజమాన్యం విజయనగరం మహారాజ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పనుల్లో భాగంగా చనిపోయినందున ఆర్థిక సహాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ దుర్గ ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి ఇరు వర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. ఎస్‌ఐ సూర్య కుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

బీరు బాటిల్‌తో యువకుడిపై దాడి

ప్రజాశక్తి– వంగర

ఎస్‌టి యువకుడు పై బీరు బాటల్‌తో పీకపై దాడి చేసిన ఘటన మండలంలోని కొప్పరవలసలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొండచాకరాపల్లి ఎస్‌టి కాలనీకి చెందిన బంటుపల్లి శంకరరావు వీరఘట్టంలో తన పనులను ముగించుకుని వస్తూ కొప్పరవలసలోగల ఓ చెట్టు వద్ద మరో వ్యక్తి కోసం వేచి ఉన్నాడు. ఇంతలో కొప్పరవలస గ్రామానికి చెందిన కోట్ల గణేష్, కోట్ల అప్పలరాము, రేగిడి మండలం తోకలవలస గ్రామానికి చెందిన బుడితి రాంబాబు ఆ చెట్టు వద్దకు వచ్చారు. ఈ నలుగురు మద్యం మత్తులో ఉండటంవల్ల మాట మాట పెరిగి ఘర్షణ జరిగి బంటుపల్లి శంకరరావు పీకపై బీరు బాటిల్‌తో దాడి చేశారు. భయభ్రాంతులకు గురైన శంకర్రావు దగ్గరలో ఉన్న తన గ్రామమైన కొండచాకరాపల్లికి చేరుకున్నాడు. స్థానికులు108లో ముందుగా వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి రాజాం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు. తనను కులం పేరుతో దూషించడంతోపాటు, బీరు బాటల్ తో పీక పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు బంటుపల్లి శంకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎఎస్‌ఐ యందవ పైడితల్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.